

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ఏడాదిలో హంద్రీ నీవా పనులు పూర్తి

- జూన్ 10లోగా విస్తరణ పనులు
- ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో హంద్రీ నీవా ఒకటి
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- డీడీఆర్‌సీ సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేసిన ఇన్‌చార్జి మంత్రి

పత్తికొండ/కర్నూలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో హంద్రీ నీవా కాలువ పులు పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పత్తికొండ సమీపంలో జరుగుతున్న పనులను పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్రలతో కలసి మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అక్కడే ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో ప్యాకేజీలు వారిగా మంత్రి



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సమీక్షించారు. పనుల్లో నిర్లక్ష్యం చూపుతున్న ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడి పురోగతిలో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ కరువు సీమకు హంద్రీ నీవా వరం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల గంపెడు మట్టి కూడా తీయకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. రాయలసీమ రైతులకు జగన్ తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2024 జూన్‌లో బాధ్యతలు చేపట్టాక హంద్రీ నీవా విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారని అన్నారు. ఈ ఏడాదిలో పనులన్నీ పూర్తి చేస్తామని, జూన్ 10లోగా విస్తరణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో హంద్రీనీవా పనులు పూర్తి చేసి రికార్డు సృష్టిస్తుందని అన్నారు. మాల్యాల ప్రధాన ఎత్తిపోతల పథకం నుంచి అనంతపురం జిల్లా జీడీపల్లి వరకు 216.30 కిలో మీటర్లు హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ బ్యాలెన్స్ పనులు ఫేజ్-1 కింద రూ.695 కోట్లతో చేపట్టామన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థలు ఇప్పటికే మట్టి పనులు మొదలు పెట్టారని అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3,240 కోట్లు కేటాయించడం చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. హంద్రీనీవా కాలువ పూర్తి చేసి... కాలువ పొడవున ఉన్న నియోజకవర్గాల్లో అన్ని చెరువులు నింపి రైతులను ఆదుకుంటామని వివరించారు. పత్తికొండ నియోజకవర్గంలో 70 చెరువులకు నీరు ఇస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో హంద్రీ నీవా విస్తరణ పనులు రూ.1,030 కోట్లతో చేపట్టి 84 శాతం పూర్తి చేస్తే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. రాయలసీమలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

ఆ ఘటనకు ఏడాది..!

- ఆరోజును జీవితంలో మర్చిపోలేను
- అప్పుడు పునర్జన్మ.. ఇప్పుడు సతీ వియోగం
- రోడ్డు ప్రమాదాన్ని గుర్తు చేసుకున్న మంత్రి ఫరూక్



తీవ్ర రక్తగాయాలతో ఎన్ఎండీ ఫరూక్ (ఫైల్)

నంద్యాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున (ఏప్రిల్ 9వతేదీ) ఎన్ఎండీ ఫరూక్ జీవితంలో మర్చిపోలేని ఘటన ఒకటి చోటు చేసుకుంది. గతేడాది ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన పాణ్యం మండలంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. నుజ్జునుజ్జయిన కారు నుంచి ఆయన రక్తగాయాలతో బయపడ్డారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనకు అది పునర్జన్మ. అయితే గత రంజాన్ మాసంలో రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. కానీ ఈ ఏడాది రంజాన్ మాసంలో మాత్రం ఆయన సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాలను మంత్రి ఫరూక్ ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ఆరోజు అసలేం జరిగిందంటే..

కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ఎన్ఎండీ ఫరూక్ గతేడాది ఏప్రిల్ 9వ తేదీన రంజాన్ పండుగ కోసం నంద్యాల నుంచి హైదరాబాద్‌కు కారులో బయలేద్దారారు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోకి రాగానే ఉన్నఫలంగా బర్రెలు వాహనానికి అడ్డుగా వచ్చి మంత్రి కారు ప్రమాదానికి గురైంది. ఈ సమయంలో కారు నుజ్జునుజ్జయింది. రక్తగాయాలతో ఉన్న ఫరూక్‌ను స్థానికులు, ఆయన క్యాన్వాయ్ సిబ్బంది ధ్వంసమైన కారు నుంచి బయటకు తీశారు. ఆ సమయంలో ఆయన కారులోని ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే ఫరూక్‌ను స్థానికంగా చికిత్సలు చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన కొద్దిరోజుల్లోనే తేరుకుని ఎన్నికల ప్రచారంలోకి వెళ్లి గెలిచారు. అనంతరం ఆయన్ను సీఎం చంద్రబాబు మంత్రివర్గంలోకి తీసుకుని మైనార్టీ, న్యాయ శాఖను కేటాయించారు. ఇదిలా ఉండగా గతేడాది రంజాన్ నెలలో ఆయన తీవ్రంగా గాయపడి పునర్జన్మ పొందితే.. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఆయన సతీమణి షహనాజ్ బేగం కన్నుమూయడం మంత్రి ఫరూక్‌కు తీరని శోకంగా మారింది.

అల్లా దయ, నంద్యాల ప్రజల ఆశీస్సులతో బతికాను



రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే షాక్‌కు గురయ్యాను. అల్లా దయతో పాటు నంద్యాల ప్రజల ఆశీస్సులతోనే బతికాను. పైగా ఎన్నికల సమయం కావడంతో కొంత ఉలికిపాటుకు గురయ్యాను. ఆ సమయంలో నా కుటుంబంతో పాటు నంద్యాల ప్రజలే గుర్తుకువచ్చారు. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడటం.. ఆ తర్వాత గాయాలతోనే ఎన్నికల ప్రచారం చేయడం, ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కడం జీవితంలో మర్చిపోలేను. రోడ్డు ప్రమాదం జరిగిన రంజాన్ మాసంలో నా సతీమణి అనారోగ్యంతో ఈ ఏడాదిలో మృతి చెందారు. ఆమె నా నుంచి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. అందరూ కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టు పెట్టుకోండి, జాగ్రత్తలు పాటించండి. డ్రైవింగ్‌లో ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు పాటించండి. మనకంటూ ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి.

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన ఫరూక్ ప్రయాణించిన కారు (ఫైల్)

విశ్రాంత అటవీ అధికారులపై చర్యలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌కో ప్రాజెక్ట్‌లో జరిగిన ఆక్రమణలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. సోమాయజులపల్లె పరిధిలోని గ్రీన్‌కో ప్రాజెక్ట్‌లో ఉల్లం ఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరనే కారణంతో అప్పట్లో సోమాయాజుల పల్లె డిప్యూటీ రేంజ్ అధికారులుగా పనిచేసిన ఏ.వీరయ్య, సీఎల్ నరసయ్యలపై శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవో నెంబరు 23, 24ను వెలువరించారు. ఈ అధికారులు గతేడాది మే 31న పదవీ విరమణ పొందినా, నిబంధన 9 ప్రకారం విశ్రాంత అధికారులపై చర్యలు చేపట్టాలని ఆయన ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఆదోని కూటమిలో

కుమ్ములాటలకు స్వస్తి..!

- పార్థసారథి, మీనాక్షినాయుడుతో మంత్రి నిమ్మల రామానాయుడు భేటీ
- ఏకాభిప్రాయానికి వచ్చిన ఇరు నేతలు
- టీడీపీ శ్రేణులతో మంత్రులు టీజీ భరత్, నిమ్మల సమావేశం

కర్నూలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో కూటమి నేతల మధ్య కుమ్ములాటకు దాదాపుగా బ్రేక్ పడింది. మంగళవారం కర్నూలులోని ప్రభుత్వ అతిథి గృహంలో ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సుదీర్ఘ చర్చలు జరిపారు. ఎట్టకేలకు ఇద్దరు కూటమి నాయకుల మధ్య రాజీ ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కూటమి ధర్మం పాటిస్తున్నాయో నియోజకవర్గాల్లో కూడా అదే సంప్రదాయం కొనసాగించాలని ఇరువర్గాల నాయకులకు మంత్రులు నిమ్మల, టీజీ గట్టిగానే చెప్పారు. గత ఎన్నికల్లో ఆదోని టీడీపీ టికెట్ ఆ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆశించారు. పొత్తులో భాగంగా బీజేపీకి ఇవ్వాల్సి రావడంతో మీనాక్షినాయుడు టికెట్‌ను త్యాగం చేశారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పార్థసారధి విజయం సాధించారు. ఎన్నికల వరకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమన్వయంతో పని చేసినా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుల మధ్య విభేదాలు తలెత్తాయి. విభేదాలు తారస్థాయికి వెళ్లి ఒకరిపై ఒకరు బహిరంగంగానే విమర్శలు చేసుకునే స్థాయికి వెళ్లాయి. ఆదోనిలో టీడీపీకి జీవం పోసి, కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన మీనాక్షినాయుడు వర్గాన్ని ఎమ్మెల్యే పార్థసారధి వ్యూహాత్మంగా అణచివేస్తున్నారని, కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదంటూ మొదటినుంచి ఆరోపణలున్నాయి. వైసీపీతో పోరాడితే అధికారంలోకి వచ్చాక వారిని బీజేపీలో చేర్చుకుని టీడీపీ కార్యకర్తలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మీనాక్షినాయుడు వర్గం రగిలిపోతుంది. ఇటీవల అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌ను కలసి తమ గోడును విన్నవించారు. దీంతో కూటమి నాయకుల మధ్య రాజీ చేసే బాధ్యతను ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు అప్పగించారు.



టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి టీజీ భరత్



మంత్రి నిమ్మల కారును చుట్టిముట్టిన ఆదోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు

పంపకాలపై నేతల పట్టు

ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడుతో మంత్రులు చర్చించారు. రాష్ట్రంలో కూటమి ధర్మంలో భాగంగా నామినేటెడ్ పదవులు కేటాయింపుల్లో టీడీపీ 80 శాతం, మిత్రపక్షాలు బీజేపీ, జనసేనలకు 20 శాతం ఇస్తున్నారు. అదే ఫార్మలాను జిల్లాలు, నియోజకవర్గాల్లో కూడా అమలు చేయాలని రాష్ట్ర కూటమి నేతల సమన్వయ కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కొంత అటూఇటుగా సర్దుకుంటూ సమన్వయంతో వెళ్తున్నారని, అదే ఫార్మలాను ఆదోనిలో కూడా కొనసాగించాలని మంత్రులు నిమ్మల, టీజీ సూచించారు. టీడీపీకి 70 శాతం, మిత్ర పక్షాలు బీజేపీ, జనసేనలకు 30 శాతం ఇవ్వాలని మీనాక్షినాయుడు కోరారు. దీంతో పార్థసారధి కలుగజేసుకుని తమ కార్యకర్తలు, నాయకులకు సమన్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని 50-50 శాతం అయితే తనకు ఒకే అన్నారు. చివరకు నామినేటెడ్ పదవులు, అభివృద్ధి పనులు టీడీపీకి 60 శాతం, బీజేపీ, జనసేనలకు 40 శాతం ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. ఈ సమయంలో 'టీడీపీలో వర్గాలు ఉన్నాయని, నా గెలుపు కోసం పని చేసిన ఇతర టీడీపీ వర్గాలకు కూడా న్యాయం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేగా నాపై ఉంది..' అని పార్థసారధి అన్నారు. 'అది మా పార్టీ అంతర్గత సమస్య.. నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జినే సుప్రీం. ఆయనతోనే సమన్వయం చేసుకోవాలి.. మా పార్టీలో వర్గాలు, విభేదాలు ఉంటే మేము చూసుకుంటాం' అని మంత్రి నిమ్మల తేల్చి చెప్పారు. అదేవిధంగా టీడీపీ నేతలందరినీ కలుపుకుని పోవాలని మీనాక్షినాయుడికి మంత్రి సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశానికి ముందుగా వందలాది మంది ఆదోని టీడీపీ కార్యకర్తలు మంత్రి కారును చుట్టి 'ఆదోని ఎమ్మెల్యే డౌన్ డౌన్..' అంటూ నినాదాలు చేశారు.

నేటితో పది మూల్యాంకనం పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీ. తాండ్రపాడు క్రేడో పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం నాటితో పూర్త కానుంది. ఇప్పటి వరకు 1,78,466 జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. మూల్యాంకనం పూర్తయి 93 శాతం నమోదైంది. మిగిలిన 7 శాతం పేపర్లను బుధవారం పూర్తి చేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మూల్యాంకనం చేపడుతున్నట్లు తెలిపారు. చీఫ్ ఎగ్జామినర్లు 114, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 682, స్పెషల్ అసిస్టెంట్లు 215 మంది విధుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, ఓపెన్ ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారం వంద శాతం పూర్తయినట్లు తెలిపారు. 16,220 ఓపెన్ ఇంటర్ జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయని తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ చీఫ్ క్యాంపు ఆఫీసర్లు, 106 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 21 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 21 మంది స్పెషల్ అసిస్టెంట్లు స్పాట్ వాల్యుయేషన్‌లో విధులు నిర్వహించారన్నారు.

గ్యాస్,పెట్రోల్ ధరలను తగ్గించాలి

కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని వామ పక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.200, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని బూటకపు హామీ ఇచ్చి ఇప్పుడు ధరలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు. చివరకు ఉజ్వల పథకంలోని గ్యాస్ సిలిండర్‌పై కూడా రూ.50 మేర పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే గ్యాస్ సిలిండర్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా కర్నూలు నగరంలోని పూలబజార్‌లో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, కార్యవర్గసభ్యులు నాగరాజు, అన్వర్, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ ధర పతనం

క్వింటా గరిష్ఠంగా రూ.6,439


ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయం మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు భారీగా పతనమయ్యాయి. 15 రోజుల్లో క్వింటాకు వేరుశనగ ధర రూ.450 పైగా ధర తగ్గింది. మంగళవారం వేరుశనగ ధర క్వింటా గరిష్ఠంగా రూ.6,439 పలికింది. వేరుశనగ ధరలు తగ్గడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల కింద సాగవుతున్న వేరుశనగ పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తున్న సమయంలో ఇలా ధరలు తగ్గిపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వమే వేరుశనగకు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 21,117 బస్తాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.3,232, గరిష్ఠ ధర రూ.6,439, సగటున రూ.6,039 పలికింది.



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడి

ఎన్టీఆర్ వైద్యసేవలు యథాతథం

- రూ.500 కోట్ల బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి



కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవలు (ఆరోగ్యశ్రీ) పునఃప్రారంభించినట్లు డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా. భాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి జిల్లాలో ఉన్న 58 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో యథాతథంగా సేవలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం రూ.500 కోట్లు బకాయిలను తక్షణమే విడుదలకు అంగీకారం తెలిపిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్, నెట్‌వర్క్ హాస్పిటల్స్ సమ్మెను విరమించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఆశా ప్రతినిధులతో జరిపిన చర్చలు సఫలమైనట్లు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు: డా. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు నుంచి హాస్పిటల్ ఎంపానెల్, నెట్‌వర్క్ హాస్పిటల్ బిల్లులు చేయిస్తామని కొంత మంది ఆగంతకులు అధికారుల పేర్లు చెప్పుకుని హాస్పిటల్స్‌ను సంప్రదిస్తున్నారని డా. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. హాస్పిటల్ యాజమాన్యం ఇలాంటి ఫేక్ కాల్స్ వస్తే హెల్ప్‌లైన్ నెంబర్.9281074745కు, డా.ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ముఖ్య కార్యనిర్వహణాధికారికి సమాచారం ఇవ్వాలని కోరారు.

కుళ్లిపోతున్న శవాలు

- మార్చురీలో పని చేయని ఫ్రీజర్లు..
- మృతదేహాలు బెంచి పైనే..
- మార్చురీలో దారుణ పరిస్థితులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరండాలో బెంచీలు, టేబుళ్లు, ఫ్యాన్ల కింద ఉంచుతున్నారు. కొన్ని మృతదేహాలను నేలపైనే ఉంచుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఫ్రీజర్లు చాలా ముఖ్యం. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మూడు ఫ్రీజర్లు ఉన్నాయి. ఒక్కో ఫ్రీజరులో ఆరు మృతదేహాలను ఉంచవచ్చు. ఏడాది కింద ఒక ఫ్రీజర్, నెలన్నర క్రితం ఒకటి, 15 రోజుల క్రితం మరోటి పని చేయకుండా పోయాయి. రూ. లక్షలు వెచ్చించి ఫ్రీజర్లను ఆసుపత్రి అధికారులు కొనుగోలు చేశారు. వీటి మరమ్మతులను కంపెనీ నిర్వహిస్తుంది. అయితే కంపెనీ ఈ మూడు ఫ్రీజర్లు చెడిపోయి ఇంత కాలమైనా మరమ్మతు చేయలేదు. ఫోరెన్సిక్ మెడిసిన్, ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో మృతదేహాలను ఫ్యాన్ల కింద ఉంచి చేతులు దులుపుకుంటున్నారు. రాయలసీమ జిల్లాల నుండే కాక ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, వనపర్తి, జిల్లాల నుంచి యాక్సిడెంట్లు, ఆత్మహత్యలు, గుర్తు తెలియని మృతదేహాలు కర్నూలు జీజీహెచ్ మార్చురీకి వస్తుంటాయి. ఈ శవాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సులు ఎంతో ముఖ్యమైనవి. శవాలు కుళ్లిపోకుండా మార్చురీలోని ఫ్రీజర్ మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలతో శరీరాన్ని గడ్డకట్టేలా చేస్తాయి. ఇటువంటి ఫ్రీజర్లను లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినా, ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో మూలనపడ్డాయి.



మార్చురీ వరండాలో ఫ్యాన్ల కింద ఉన్న మృతదేహాలు



మార్చురి



మార్చురీలో అధ్వానం

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి ప్రతిరోజు 6 నుంచి 7 మృతదేహాలు వస్తుంటాయి. ఇక సోమ, మంగళవారాల్లో ఈ సంఖ్య మరీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారు, ఆత్మహత్యలు చేసుకున్నవారు, అనాథ శవాలు, ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ కేసుల్లో మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయి. ప్రమాదంలో మరణించిన వారి శవాలకు మార్చురీలో ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించాలి. అంత వరకు మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లు పని చేయక పోవడంతో వరండాలోనే ఫ్యాన్ల కింద వదిలేస్తున్నారు. ఫ్రీజర్లు లేకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

ప్రతి నెల 150 మృతదేహాలు

ప్రతిరోజూ ఆరు నుంచి ఏడు దాకా మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయి. ప్రతి నెలా 150 నుంచి 160 మృతదేహాలను ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. ఇక ప్రతి సంవత్సరం 1500 దాక మృతదేహాలను మార్చురీలో భద్రపరుస్తుంటారు. వాక్ ఇన్ కూలర్ ఏడాది కాలంగా ఒక బాడీ ఫీజర్ రెండు నెలలుగా, మరో ఫీజర్ 15 రోజులుగా ఇంకో ఫీజర్ 7 రోజులుగా పని చేయడం లేదు.

ఎలుకలు, పందికొక్కులు

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలుకలు, పందికొక్కులు స్వైర విహారం చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా మార్చురీ గదిలో ఫ్రీజర్లు పని చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మార్చురీ ఆవరణ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మృతదేహాలను మార్చురిలో ఉంచడం వల్ల రాత్రిపూట ఎలుకలు, పందికొక్కులు కరుస్తున్నాయి. కొన్ని అనాథ శవాలకు చీమలు పడుతున్నాయి.



పని చేయని ఫ్రీజర్లు

నిరూపయోగంగా మారాయి

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ కూలర్ ఫీజర్లు పని చేయడం లేదు. దీంతో ప్రతిరోజూ వచ్చే మృతదేహాలను సెప్టిక్ మార్చురీలో ఫ్యాన్ల కింద ఉంచుతున్నారు. మూడు ఫీజర్లు, వాక్ ఇన్ కూలర్ కూడా మూలన పడటంతో మృతదేహాలు, అనాథ మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. దీంతో ఎంఎల్‌సీ లీగల్ కేసులకు పోస్టుమార్టం చేయడం ఫోరెన్సిక్ వైద్యులకు కష్టంగా మారింది. మెడికో లీగల్ కేసులను త్వరగా పోస్టుమార్టం చేస్తున్నా దూర ప్రాంతం నుంచి వచ్చే కేసులకు పోలీసులు పంచనామా ఆలస్యం కావడంతో రెండు రోజుల సమయం పడుతుంది. ఈలోగా మృతదేహాలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మార్చురీలో ఉన్న మూడు బాడీ ఫ్రీజర్లు పని చేయడం లేదు. ఈ విషయాన్ని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాం. వాక్ ఇన్ కూలర్ ఫీజర్లు మరమ్మతుల కోసం ప్రిన్సిపాల్ కాలేజీ డెవలప్‌మెంట్ సొసైటీ కింద రూ.2.70 లక్షల నిధులను మంజూరు చేశారు. ఫ్రీజర్ల మరమ్మతుల కోసం బ్లూస్టార్ కంపెనీ వారితో సంప్రదించి సమస్య పరిష్కరిస్తాం.

\- డాక్టర్ టి.సాయిసుధీర్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కర్నూలు మెడికల్ కాలేజీ



పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

- రూ.61 లక్షల విలువైన 2డీ ఎకో కలర్ డాప్లర్ యంత్రాన్ని ప్రారంభించిన మంత్రి



2డీ ఎకో కలర్ డాప్లర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ విభాగంలో సీడీఎస్ నిధుల కింద రూ.61 లక్షలతో ఏర్పాటు చేసిన 2డీ ఎకో కలర్ డాప్లర్‌ను మంత్రి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్డియాక్ క్యాత్‌ల్యాబ్‌ను మంత్రి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను 2029 నాటికి కార్పొరేట్ స్థాయి హాస్పిటల్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధికమించి సరికొత్త వైద్యపరికరాలను ఆసుపత్రికి సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించడానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ యంత్రం నెలలోపు పిల్లలకు పరీక్షించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కార్డియాలజీ ప్రొఫెసర్ డా.చంద్రశేఖర్ మాటాడుతూ 2డీ ఎకో కలర్ డాప్లర్ మిషన్ మెడికల్ కాలేజీ డెవలప్మెంట్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, కార్డియాలజీ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డా.లక్ష్మీబాయి, డిప్యూటీ సూపరింటెం డెంట్లు డాక్టర్ డి. శ్రీరాములు, డా. సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో మే, జూన్ 2024లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమా ఆదేశాల మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని, విద్యార్థులు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 2వ సెమిస్టర్‌లో 1636కు 638, 4వ సెమిస్టర్‌కు 1752 మంది పరీక్షలు రాయగా 627 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

11న నంద్యాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నంద్యాలకు రానున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఇంటి స్థలాల అర్జీదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత మూడు నెలల నుంచి దశల వారిగా ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీదారులతో ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. మండలాల్లో తహసీల్దార్లకు వ్యక్తిగత అర్జీలు సైతం ఇప్పించామన్నారు. పేదల సమస్యలపై చర్చించేందుకు రామకృష్ణ నంద్యాలకు రానున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- ఉమ్మడి కర్నూలుపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- ప్రజా సమస్యలను పరిష్కరించండి
- డీడీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు



కర్నూలు కలెక్టరేట్/కర్నూలు ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధించేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీడీఆర్సీ) సమావేశం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగింది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారథి, బి.విరూపాక్షి తదితరులు హాజరయ్యారు. జిల్లాలో ఇరిగేషన్, వ్యవసాయం, రహదారులు, పారిశ్రామిక అభివృద్ధి.. వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు డీడీఆర్సీ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేలు తీసుకొచ్చిన పలు సమస్యలు అక్కడే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు సంబంధించి పీ-4 అమలులో కర్నూలు జిల్లా ముందు ఉండన్నారు. పీ-4లో భాగంగా దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలు తరిమేస్తే.. కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తెస్తోందన్నారు. కర్నూలు జిల్లాకు సాగునీటి కోసం, విద్యావ్యవస్థలో నాణ్యమైన విద్య కోసం యువనేత, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా, ఇరిగేషన్ పరంగా అభివృద్ధి చేసి కరువు నివారణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇరిగేషన్ మంత్రిగా నిమ్మల రామానాయుడు, పరిశ్రమల మంత్రిగా తాను ఆ రెండు విభాగాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. తద్వార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయని వివరించారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ సోమిశెట్టి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే తమ అభిప్రాయలను డీడీఆర్సీ దృష్టికి తెచ్చారు.

కన్నయ్య నాయుడుతోనే తుంగభద్ర జలాలు



రిటైర్డు ఇంజనీర్ కన్నయ్య నాయుడు వల్ల తుంగభద్ర డ్యాం గేట్లు మరమ్మత్తులు చేసి డ్యాం నుంచి 2 టీఎంసీల నీరు ఈ వేసవిలో జిల్లాకు రావడం చాలా సంతోషకరం. రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేసే ఉద్దేశంతో ఉన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో మోటార్లు దొంగతనం జరిగింది. ఇప్పుడు అక్కడ కూడా రిపేరీ పనులు జరుగుతున్నాయి. ఎమ్మిగనూరుకు జీవనాధారమైన గాజులదిన్నె ప్రాజెక్టుకు ఇంకా భూసేకరణ సమస్య ఉంది. దీనిని పరిష్కరించండి. అలాగే గువ్వలదొడ్డి చెరువుకు 20 సంవత్సరాల నుంచి ఏ మాత్రం సహాయం చేయడం లేదు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పాఠశాలలో డిజిటల్ స్క్రీన్స్ పని చేయడం లేదని వాటిని మార్చండి.

\- జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

రైతులను ఆదుకోండి



ఓర్వకల్లు, కల్లూరును కరువు మండలాలుగా ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో శనగ పంట ఎక్కువ మోతాదులో సాగు చేశారు. వాతావరణ పరిస్థితుల వల్ల పంట దక్కక రైతులు చాలా నష్టపోయారు. వారిని ఆదుకోవాలి. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. అలగనూరు రిజర్వాయరుకు నిధులు కేటాయించండి. ఉలిందకొండ చెరువు, కొలంపల్లి తండా చెరువులను నింపాలి.

\- గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం

చెక్‌డ్యాంలు మంజూరు చేయండి



ఆదోనికి నీళ్ల తెచ్చే కార్యక్రమాలను చేపట్టండి. ఆదోని నియోజకవర్గానికి నాబార్డు కింద చెక్‌డ్యాంలు మంజూరు చేయండి. మంత్రి, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆదోని నియోజకవర్గాన్ని కూడా ప్రతిపాదనల్లో చేర్చాలి. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీ వల్ల మధ్య తరగతి వారు నలిగిపోతున్నారు. దీనిని అరికట్టండి. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి పేదలు చదువుకునే అవకాశాన్ని ఇవ్వాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలను ఒకటో తరగతిలో మాత్రం చేర్చుకుని ఆ తర్వాత 2, 3 తరగతుల్లో ఫీజులు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి ఫొటోలు ఉండేలా ఆదేశాలు ఇవ్వండి.

\- డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్యే, ఆదోని

జొన్నగిరి చెరువుకు నీరివ్వండి



2018లో 68 చెరువులు నింపే కార్యక్రమం ప్రారంభమైంది. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని చెరువులను నింపాం. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి శంకుస్థాపన చేసిన జొన్నగిరి చెరువుకు మాత్రం నీటిని ఇవ్వలేకపోతున్నాం. ఈ చెరువుకు నీరు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పందికోన రిజర్వాయర్ పనులు 50 శాతమే పూర్తయ్యాయి. ఎడమవైపు లిఫ్టు ఏర్పాటు పనులను కూడా పూర్తి చేస్తే 3 అసెంబ్లీ నియోజకవర్గాలకు నీటి సమస్య ఉండదు.

\- కేఈ శ్యాంబాబు ఎమ్మెల్యే, పత్తికొండ

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కోడుమూరులో పది రోజులకు ఒకసారి తాగునీరు వస్తున్నాయి. చుట్టూ నీళ్ల ఉన్నా కోడుమూరులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. అదేవిధంగా దేవమ్మమడుగులో తెలంగాణ వారు ఆక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారు. దీంతో నీటి సమస్య ఏర్పడుతోంది. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

\- బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్యే, కోడుమూరు


కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని పూర్తి చేయండి



మిర్చి పంట అధికంగా పండించడం వల్ల నిల్వ చేసుకోవడం కష్టంగా ఉంది. రైతులు గుంటూరుకు వెళ్లి స్టోర్ చేసుకోవాల్సిన పరిస్థితి. కర్నూలు మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న కోల్డ్ స్టోరేజీని వెంటనే పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను వెడల్పు చేసే కార్యక్రమం జరుగుతున్నందున, కాలువకు స్లూయిస్‌లు పెట్టి గ్రామాలకు నీటిని కేటాయించాలి. కేఆర్ఎంబీ కార్యాలయాన్ని కర్నూలులోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

\- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి



వేదవతి ప్రాజెక్టు మొత్తం రూ.1900 కోట్లతో చేపట్టాల్సి ఉండగా.. అందులో ఇప్పటికి రూ.110 కోట్లు పనులు జరిగాయి. ఆ ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లయితే 80వేల ఎకరాలకు ఇరిగేషన్ నీటిని ఇవ్వగలం. ఉమ్మడి జిల్లాలో 68 మైక్రోఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. అందులో కర్నూలు జిల్లాలో 35 ట్యాంకులు ఉంటే 33 ట్యాంకులను మార్చి 15వ తేదీ నాటికి అన్ని చెరువులను నీటితో నింపడం జరిగిందన్నారు. పందికోన రిజర్వాయర్‌కి రూ.250 కోట్లు ఖర్చు చేసినట్లయితే 40వేల ఎకరాలకు నీరు ఇవ్వవచ్చు. 2 నెలల్లో హంద్రీలో జంగిల్ క్లియరెన్స్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- రంజిత్ బాషా, కలెక్టర్, కర్నూలు

భూమి కోసం...



తహసీల్దార్‌ను నిలదీస్తున్న మహిళ

- కోడుమూరు తహసీల్దార్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం
- ఇప్పటికే విడతలవారీగా రూ.లక్ష తీసుకున్న వీఆర్వోలు
- తహసీల్దార్‌కు రూ.10వేలు ఇచ్చా • బాధితురాలి ఆరోపణ

కోడుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం రెవెన్యూ అధికారుల వద్దకు తిరిగి విసిగిపోయిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఇప్పటికే రూ.లక్ష దాకా ఇచ్చుకున్న ఆ మహిళ ఇక చేతకాక నిస్సహాయ స్థితిలో ఏకంగా తహసీల్దార్ ఎదుటే పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం కోడు మూరు మండలంలో చోటు చేసుకుంది. కోడు మూరు మండలంలో పని చేస్తున్న ముగ్గురు వీఆ ర్వోలు తనను మానసికంగా వేధించడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించి ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసి తమ కోరిక తీర్చాలని చిత్రహింసలకు గురి చేస్తున్నారని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన హైమావతి అనే మహిళ ఆరోపించారు. అంతే కాకుండా తన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఇప్పటికే రూ.లక్ష దాకా డబ్బులు తీసుకున్నారని ఆమె వాపోయింది. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదనకు గురై మంగళవారం ఏకంగా తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ ఎదుట పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిం చింది. అయితే తహసీల్దార్ ఆమెను అడ్డుకుని చేతిలోని పురుగుల మందు బాటిల్‌ను లాగేసి ఆమెకు సర్దిచెప్పారు.

'రూ.10వేలు ఎందుకు తీసుకున్నావ్..'

ఓపిక నశించిన హైమావతి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ వెంకటేశ్ నాయక్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఫైల్ కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని నా దగ్గర రూ.10వేలు ఎందుకు తీసుకున్నావని ఆమె నేరుగా నిలదీసింది. రూ.10వేలు తీసుకొని కలెక్టర్ ఆఫీసుకు తన ఫైల్ ఎందుకు పంపించలేదని అడిగిన ప్రశ్న లకు తహసీల్దార్ సమాధానం చెప్పకుండా దాటవేశారు. భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామని ముగ్గురు వీఆర్వోలు తన దగ్గర రూ.లక్ష తీసుకొని, రోజూ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నా రన్నారు. తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని తెలిపింది. డబ్బు తీసుకొని చివరకు తమ కోరిక తీర్చాలని వేధిస్తున్నారని సిగ్గు విడిచి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. అయినా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇది తహసీ ల్దార్ కార్యాలయమేనా అంటూ ఆగ్రహం వెళ్లగక్కింది.

12 ఏళ్లుగా భూమి కోసం పోరాటం

చాకలి హైమావతి అనే వివాహిత కోడుమూరులో నివాసం ఉంటోంది. తండ్రి పెద్ద సవారికి ఇద్దరు భార్యలు. రెండవ భార్య రాములమ్మకు హైమావతి సంతానం. తండ్రి పెద్ద సవారికి ప్యాలకుర్తి గ్రామంలో 9ఎకరాల భూమి ఉంది. తండ్రి ఆస్తిలో తనకు సగం హక్కు ఉందని పెద్దసవారి మొదటి భార్య కుమారుడు లక్ష్మన్నపై హైమావతి పోరాటం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా 2011 కోర్టును ఆశ్రయించింది. 12 సంవత్స రాలు పోరాట అనంతరం ఉన్న ఆస్తిలో సగం భాగం హైమావతికి చెందుతుందని 2023లో కోర్టు తీర్పు ఇచ్చింది. నాటి నుంచి నేటి వరకు కార్యాలయానికి తిరగని రోజంటూ లేదు.

ఉద్యోగం నుంచి తొలగించాలి



నాలుగు ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేస్తానని రూ.లక్ష తీసుకున్నారు. అంతటితో ఆగకుండా అసభ్యకరంగా ప్రవర్తించారు. నన్ను వేధించిన ముగ్గురు వీఆర్వోలను ఉద్యోగం నుంచి తొలగించాలి. నా నుంచి రూ.10 వేలు తీసుకుని ఎలాంటి న్యాయం చేయని తహసీల్దార్‌పై కూడా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే నాకు ఆత్మహత్యే గతి. **- హైమావతి, బాధితురాలు**

పోలీసులతో విచారణ జరిపిస్తాం

హైమావతి ఆరోపణలపై విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. విచారణలో నిర్ధారణ అయితే కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరాను. హైమావతి పొలం ఫైల్ కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లేదు. ఉన్నతాధికారుల సమక్షంలో పెండింగ్ ఉంది. కోర్టు ఆదేశాలకు లోబడి ఉన్నాం. **- వెంకటేశ్‌నాయక్, తహసీల్దార్, కోడుమూరు**

యువతి ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌లో అనారోగ్యంతో దివ్య (20) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. దివ్య తన తల్లిదండ్రులు సుధాకర్, ప్రభావతిలతో పాటు కూలీ పనులు చేస్తుంటుంది. ఈమె గత కొద్ది కాలంగా మైగ్రేషన్ తలనొప్పితో బాధపడుతున్నది. మంగళవారం ఇంట్లో రేకులషెడ్డుకు ఉన్న పైపుకు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. తల్లిదండ్రులు, బంధువులు తలుపులు పగులకొట్టి దివ్యను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దివ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

వెల్దుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన యువరైతు మహ్మమ్మద్ రసూల్ (21) వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. తనకున్న ఎకరన్నర పొలంలో కనకాంబరాల పూలను సాగు చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం కూడా పొలంలో కనకాంబరాలకు నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన పక్క పొలాల రైతులు చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ నాయకుడు రామకృష్ణాచారి యువరైతు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



మహ్మద్ రసూల్(ఫైల్)

ఎల్లెల్సీలో పడి బాలుడి మృతి

- కన్నీరు మున్నీరైన కుటుంబసభ్యులు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీలో ప్రమాదవశాత్తుపడి ఓ దివ్యాంగుడు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు చిన్న హనుమంతు, లక్ష్మిలతో పాటు, మాటలు రాని వారి కుమారుడు హనుమేష్(9) ఎల్లెల్సీ పక్కన ఉన్న పొలానికి వెళ్లారు. తల్లిదండ్రులు పొలం పనులలో నిమగ్నం ఉండగా కుమారుడు సైకిల్ తొక్కుతూ ఆడుకుంటున్నాడు. అయితే ఎంత సేపటికి కుమారుడు తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. ఎల్లెల్సీ గట్టున సైకిల్ కనిపించింది. ప్రమాదవశాత్తు హనుమేష్ కాలువలో పడ్డాడు. బాలుడికి మాటలు రాకపోవడంతో తల్లిదండ్రులు గుర్తించలేకపోయారు. గ్రామస్తులు కాలువలో గాలించారు. అప్పటికే బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో మునిగి యువకుడి మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో బావిలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలివీ.. కల్లూరు మండలం తనడకనపల్లె గ్రామానికి చెందిన కురువ మధు(28) తన అత్తమామల గ్రామం హెచ్. మురవణికి వచ్చాడు. అయితే గ్రామంలో ఉన్న ఓ బావి దగ్గర సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాడు. అయితే ఈత కొట్టేందుకు బావిలోకి దూకగా బావి నుంచి బయటకు రాలేదు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలోని కొంతమందిని విచారించగా బావివైపు వెళ్లినట్లు తెలపడంతో బంధువులు బావి దగ్గరకు వెళ్లి చూశారు. మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ తెలిపారు.

వడదెబ్బతో బాలుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలం గుడికల్లు సమీపంలో ఉన్న శ్రీరామనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. శ్రీరామనగర్ కాలనీకి చెందిన వీరేష్, నాగవేణిల పెద్ద కుమారుడు శ్రీనాథ్(14) ఎండదెబ్బకు గురయ్యాడు. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో కర్నూలులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో మృతి చెందాడు. వీరేష్, నాగవేణిలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



పులికాటి శ్రీనాథ్(ఫైల్)

కార్పొరేటర్ మృతి

కర్నూలు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ మండలంలోని 38వ వార్డు కార్పొరేటర్ రాచపూడి రవికుమార్(45) అలియాస్ గిప్సన్ మృతి చెందారు. ఐదేళ్ల ఆయన తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. కర్నూలులోని స్టాంటన్‌పురంలో నివాసం ఉంటున్న గిప్సన్ ఆరోగ్యం రెండు రోజుల క్రితం క్షీణించడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక మంగళవారం తెల్లవారు జామున 3గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ ఎమ్మెల్యేలు జె.సుధాకర్, మణిగాంధీ, మేయర్ బీవై రామయ్య, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, మేనేజరు చిన్నరాముడు, సూపరిటెండెంట్ రామకృష్ణ, కార్పొరేటర్ సాంబ తదితరులు స్టాంటన్‌పురంలోని గిప్సన్ ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



గిప్సన్ (ఫైల్)

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాణ్యం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపూరు వద్ద కుందూ నదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మృతుడి శరీరంపై మెరూన్ ఎరుపు రంగు టీషర్ట్, దానిపై బీఎల్ అక్షరాలు ఉన్నాయని చెప్పారు. మెరూన్ ఎరుపురంగు కట్ బనియన్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. కుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చ బొట్టు, అవిధ అనే అక్షరాలు ఉన్నాయని తెలిపారు. ఎడమ చేతిపై ఫ్యామిలీ గుర్తు ఈక గుర్తు ఉందన్నారు. జీన్స్ ప్యాంట్ జేబులో పల్సర్ మోటారు సైకిల్ తాళం ఉందని, కీచైన్‌పై ఆంజనేయస్వామి గుర్తు ఉందని చెప్పారు. కుడి చేతి బొటన వేలు దగ్గర లవ్ గుర్తు కలిగిన సిల్వర్ రింగ్‌పై పీఎస్ అనే అక్షరాలు ఉన్నాయన్నారు. ఈ ఆదారాలు గుర్తించిన వ్యక్తులు పాణ్యం పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- తృటిలో తప్పించుకున్న బజ్జీల వ్యాపారి

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్ సర్కిల్ కారిబోడి కాలనీలో బజ్జీల వ్యాపారం చేస్తున్న షేక్షావలి బంకులో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలింది. బజ్జీలు వేస్తుండగా గ్యాస్ లీక్ అవడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించి షేక్షావలి బంకు నుంచి బయటకు పరుగులు తీశారు. ఈలోగా గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ పేలుడుతో దాదాపు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు షేక్షావలి తెలిపారు.

గంజాయి తీసుకో... మద్యం బాటిల్ ఇచ్చుకో

- చిన్న పెండేకల్లులో గంజాయి సాగు
- కర్నూలు పోలీసుల అదుపులో నిందితుడు

ఆదోని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక మద్యం బాటిల్ నాకివ్వు.... నీకు కావాల్సినంత గంజాయి ఇస్తా.... ఈ విషయం మనద్దరి మధ్యనే ఉండాలి... మూడో వ్యక్తికి తెలిసిందా... ఇకపై నీకు గంజాయి ఇవ్వను చూడు.... ఇదీ ఒప్పందం. కానీ ఏదో ఒక రోజు ఈ అక్రమ గంజాయి సరఫరా వ్యవహారం బయట పడు తుందని తెలుసుకోలేకపోయాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. ఆదోని మండలం చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన కురువ కోదండరాముడు తన మిరప పంటలో నిత్యం గంజాయి సాగు చేస్తూ, తనకు అనుకూలమైన వారికి విక్రయించేవాడు. కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో పని చేసే కార్మికుడికి గంజాయి సరఫరా చేసేవాడు. నీకు కావాల్సినంత గంజాయి ఇస్తా... గంజాయి నీకిచ్చినప్పుడల్లా నాకు ఫుల్ బాటిల్ మందు ఇవ్వాలని కోదండరాముడు షరతు పెట్టాడు. ఈ మేరకు ఇరువురి మధ్య గంజాయి ఇవ్వడం, మద్యం తీసుకోవడం అనే వ్యవహారం సాగుతోంది.



కర్నూలులో తీగలాగిన పోలీసులు...

కర్నూలు త్రీటౌన్ పోలీసులకు అనుమానం వచ్చి ఆ హోటల్‌లో పనిచేస్తున్న కార్మికుడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో గంజాయి మూలాలు బయట పడ్డాయి. ఆ హోటల్ కార్మికుడి ద్వారా పోలీసులు కోదండ రాముడుకు ఫోన్ చేయించి గంజాయి కావాలని అడిగించారు. సరే గంజాయి ఇస్తాను... నాకు మద్యం బాటిల్ తీసుకురా అని హోటల్ కార్మికుడికి కోదండరాముడు తెలిపాడు. నాలుగురోజుల క్రితం పోలీసులు రెండు వాహనాల్లో చిన్నపెండేకల్లుకు చేరుకొని హోటల్ కార్మికుడికి గంజాయి ఇస్తున్న కోదండరాముడిని అరెస్టు చేసి కర్నూలుకు తరలించారు. చిన్నపెండేకల్లు గ్రామం తాలుక పోలీస్ స్టేషన్‌పరిధికి వస్తుండడంతో నిందితుడిని త్రీటౌన్ పోలీసులు తాలుకా పోలీసులకు సోమవారం సాయంత్రం అప్పగించారు.

గంజాయి నిర్వాహకుడిని అప్పజెప్పారు..

చిన్నపెండేకల్లుకు చెందిన కురువ కోదండరాముడ్ని కర్నూలు పోలీసులు మాకు అప్పజెప్పారు. మేం విచారిస్తున్నాం. నిందితుడు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మరికొందరిని విచారిస్తున్నాం. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం. **- నల్లప్ప, సీఐ, ఆదోని.**

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: ఎస్పీ

వెల్దుర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామాన్ని ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. గ్రామంలో ప్రధాన వీధులు, కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం వెల్దుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి చేరుకొని పోలీసులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ ప్రసాద్‌బాబు, కర్నూలు సీఐ రామానాయుడు, వెల్దుర్తి సీఐ మధుసూదనరావు, వెల్దుర్తి ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఇళ్లలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలోని ఇళ్లల్లో చోరీ మంగళవారం చోరీ చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. మహాబలేశ్వరప్ప అనే వ్యక్తి ఇంటికి తాళం వేసుకొని విధులకు వెళ్లాడు. వీరింటి పక్కను ఉన్న సాదాపురం గోపాల్ కూడా దానాపురంలోని ఆంజనేయస్వామి ఉత్సవాలకు వెళ్లేందుకు తాళం వేసుకొని వెళ్లారు. ఈ రెండు ఇళ్లకు తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. మహాబలేశ్వరప్ప ఇంట్లో బీరువాలోని ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ. 60వేలు, అలాగే సాదాపురం గోపాల్ ఇంట్లో బీరువాలో ఉన్న ఐదు గ్రాముల బంగారం ఆభరణాలతో పాటు, రూ.లక్షను అపహరించారు. ఇంటికి వచ్చిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ రామలింగయ్య తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన బీరువా

ఆదోని మార్కెట్‌లో ఆగని వేరుశనగ గ్రేడింగ్

- అధికారుల ఆదేశాలు బేఖాతరు



వేరుశనగ దిగుబడిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వేరుశనగకు మహిళా కూలీల చేత గ్రేడింగ్(పాసింగ్)చేయించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రేడింగ్ చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోవడమే కాకుండా సాయంత్రం వరకూ తూకాలు వేసుకోకుండా వ్యాపారులు ఇబ్బందులు గురి చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు గ్రేడింగ్ చేయొద్దని వేరుశనగ వ్యాపారులను హెచ్చరించి నోటీసులు జారీ చేసినా వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. పొలం కల్లాలోనే, ఇంటి వద్దను విక్రయానికి తెచ్చేముందు వేరుశనగ దిగుబడిలో ఉన్న చెత్తాచెదారం, రాళ్లు, మట్టి పెళ్లలు తీసి శుభ్రం చేసుకొస్తున్నామని రైతులు చెబుతున్నారు. వ్యాపారులు మార్కెట్‌లో రైతులు తమ కమిషన్ ఏజెంట్ దుకాణాల ముందు వేరుశనగ దిగుబడిని టెండర్ కోసం రాశులుగా ఉంచితే టెండర్ వేసే సమయంలో వ్యాపారులు పలుచగా పరిచి గ్రేడింగ్ చేస్తున్నారన్నారు. రెండుసార్లు గ్రేడింగ్ చేసి చేయడం వల్ల తాము నష్టపోతున్నామని, ఇలాగే కొనసాగితే వేరే మార్కెట్ కమిటీలకు వెళ్లే పరిస్థితి వస్తుందని రైతులు హెచ్చరిస్తున్నారు. రైతులకు నష్టం కలిగించే గ్రేడింగ్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతున్నారు.

రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి

- ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఆర్‌ఆండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా ఆర్‌ఆండ్‌బీ శాఖాధికారులతో కలసి బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బనగానపల్లె పట్టణ సమీపంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలించారు. పంటలు ఉండడంతో తాత్కాలికంగా రింగ్‌రోడ్డు పనులు నిలిపివేసినట్లు ఆర్‌ఆండ్‌బీ జిల్లా ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి చీఫ్ ఇంజనీర్‌కు వివరించారు. పంటలు అయిపోయిన తర్వాత రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే క్రిష్ణగిరి నుంచి మంగంపేట తండా వరకు జరుగుతున్న టీటీ రోడ్డు పనులను చీఫ్ ఇంజనీర్ స్వయంగా పరిశీలించారు. ఫారెస్టు క్లియరెన్సు రాకపోవడంతో కొంత భాగం పనులు ఆగిపోయాయని ఫారెస్టు క్లియరెన్సు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను వందశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ వెంట ఆర్‌ఆండ్‌బీ జిల్లా ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్, ఆర్‌ఆండ్‌బీ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా బనగానపల్లె ఆర్‌ఆండ్‌బీ పనుల వేగవంతంపై అధికారులతో చీఫ్ ఇంజనీర్ సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ ఆర్‌ఆండ్‌బీ అధికారులను ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి

ఆలూరులో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న విజయ ప్రతాప్ రెడ్డి



కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్

- సంక్షేమ హాస్టళ్లు, రేషన్ దుకాణాల పరిశీలన
- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు

ఆలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి మంగళవారం పర్యటించారు. మొలగవల్లి గ్రామంలో రేషన్ సరఫరా చేసే వాహనాన్ని ఆయన తనిఖీ చేశారు. సక్రమంగా నిత్యావసరాలు సరఫరా చేస్తున్నారా? లేదా? అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు కేజీబీవీ స్కూల్, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌తో పాటు రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో సక్రమంగా భోజనం సరఫరా చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్స్, రేషన్ షాప్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా సరుకులు సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన కూరగాయలు, గుడ్లు, సరుకులు సరఫరా చేయకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వరకు తనిఖీలు చేశారు. ఆయన వెంట సీఐ రవి శంకర్ రెడ్డి, తహసీల్దార్ గోవింద్ సింగ్, డీటీ దీప, ఆర్ఐ బసవన్న గౌడ్, ఏఎస్ డబ్ల్యూఓ బాబు, ప్రిన్సిపాల్స్ సుహాసిని, జమ్మన్న, వార్డెన్ మహ్మద్ అలీ, షెహనూర్ తదితరులు ఉన్నారు.

మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మాతాశిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. మంగళవారం కల్లూరులోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన పోషకాహార పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ తల్లి, బిడ్డలలో పోషకాహార లోపాన్ని నివారించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం సీడీపీవో అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను డీఎంహెచ్‌వో పరిశీలించారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న మంత్రులు, కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రూ.19.33 లక్షలు విలువ చేసే జిల్లా స్థాయి ఉచిత ఉపకరణాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్‌బాషాలు హాజరై ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు.

పన్ను వసూళ్ల కేంద్రం తనిఖీ



పన్ను చెల్లింపుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రాన్ని కమిషనర్ రవీంద్రబాబు మంగళవారం పరిశీలించారు. పన్ను చెల్లింపుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 30లోపు నగరంలోని భవనాలు, ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్ను చెల్లించని వారి తాగునీటి సరఫరా నిలిపివేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునైద్ పాల్గొన్నారు.

'విభజించి పాలిస్తున్న బీజేపీ'



మాట్లాడుతున్న జిలానీ బాషా

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ విభజించి పాలిస్తుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీ బాషా ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొందరు ముస్లింలతో వక్ఫ్ బిల్లుకు అనుకూలంగా మాట్లాడిస్తుందన్నారు. మరికొంత మంది వైపీపీ నుంచి దొంగ వ్యాఖ్యలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న ముస్లింలు మాత్రం బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నామన్నారు. పార్లమెంట్, లోక్ సభలో భిన్నంగా ఓటు వేసిన వైసీపీని కూడా ప్రజలు క్షమించరన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ జిల్లా చైర్మన్ సాంబశివుడు, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అనంత రత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, లాజరస్, అబ్దుల్, ఆర్.ప్రతాప్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15వ తేదీ నుంచి 18 వరకు జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జాతీయ కార్యదర్శి నక్కి. లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారం చేపట్టి 11 సంవత్సరాలు కావస్తున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు హనుమేష్, సహాయ కార్యదర్శులు బీసన్న, రాజు, నగర అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

సి.బెళగల్, ఏప్రిల్ 8(ఏప్రిల్): మండలంలోని మారండొడ్డి గ్రామంలో మంగళవారం జిల్లాస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈపోటీలను టీడీపీ నాయకుడు జిక్రియ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పురస్కరించుకుని గ్రామంలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విజేతలకు దాతలు బహుమతులు అందజేశారు.

పొదుపు మహిళలు ఆర్థికంగా రాణించాలి

సి.బెళగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికంగా రాణించాలని వెలుగు ఏపీఎం రమేష్ అన్నారు. మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో బుక్ కీపర్లకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బుక్ కీపర్లు, సీసీలు పాల్గొన్నారు.

జీతాల్లో కోత

● పార్కు కార్మికుల కడుపుకొడుతున్న సొసైటీ
● పట్టించుకోని అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ పార్కుల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నారు. కార్మికుల జీతాల చెల్లించేందుకు మదర్ థెరిస్సా ఇంటిగ్రేటెడ్ సొసైటీ కాంట్రాక్టు దక్కించుకుంది. గత సంవత్సరం సెప్టెంబరులో కాంట్రాక్టు దక్కించుకున్న కూడా సొసైటీ నుంచి కార్మికులకు జనవరి నుంచి మాత్రమే జీతాలు ఇస్తున్నారు. మిగిలిన నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉంచారు. ఈ క్రమంలో పార్కులకు సంబం ధించి 22 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.12వేల జీతం సొసైటీ తరపున ఇవ్వాలి. గత మూడు నెలలుగా సొసైటీ నుంచి కార్మికులకు నాలుగు వేలు కోత విధించి కేవలం రూ.8వేలు మాత్రమే ఇస్తున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **కార్మికులను మోసం చేస్తున్న సొసైటీ:** కార్పొరేషన్ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్న సొసైటీ కార్మికులను మోసం చేస్తుంది. ప్రతి నెలా చెల్లించే జీతాలలో కోతలు విధిస్తూ వారి కడుపు కొడు తున్నారు. గతంలో కూడా ఈ సొసైటీపై పలు ఆరోపణలు రావ డంతో సుమారు ఐదేళ్లుగా నగర పాలక పరిధిలో ఈ సొసైటీ కనప డకుండా పోయింది. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చాక సొసైటీ మళ్లీ వెలుగులోకి వచ్చింది. గతంలో కూడా సొసైటీ ఆధ్వర్యంలో కార్మికులకు రావాల్సిన పీఎఫ్ సొమ్మును కాజేసినట్లు ఆరోపణలు న్నాయి. అయినా కూడా ఇలాంటి సొసైటీలకే కార్పొరేషన్ అధికా రులు కాంట్రాక్టు ఎందుకు ఇస్తారో అర్థం కావడం లేదు. గత సంవత్సరం సెప్టెంబరులో సొసైటీ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే కార్మికుల నుంచి పలు ఫిర్యాదులు రావడంతో అధికారులు కాల యాపన చేశారు. ఈ క్రమంలో సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు పాత కాంట్రాక్టర్‌కే కార్మికులకు జీతాలు చెల్లించేలా అధికా రులు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులకు నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.

● **రోజు కూలి రూ.400:** కార్మికునికి రోజు కూలి రూ.400 చొప్పున నెలకు రూ.12 వేలు రావాలి. అయితే 22 మంది కార్మికులకు నెలకు రూ.2.64000 అవుతుంది. ఈ క్రమంలో సొసైటీ తరపున కొందరు కార్మికులకు రూ.12 వేలు ఇవ్వకుండ రూ.2 వేలు జీతంలో కోత విధిస్తున్నారు. దీంతో ప్రతి నెల రూ.44 వేలు సొసైటీ ఖాతాల్లోకి వెళ్తుంది. ఏదైనా అడిగితే ఆదివారం, పండుగ రోజుల్లో రాలేదని కోత విధిస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని కార్మికులు అడిగితే వారిని పనిలో నుంచి తొలగించి ఇతరులను నియమించుకుంటున్నారు. దీంతో ఎవ్వరు కూడా గట్టిగా అడగలేని పరిస్థితి నెలకొంది. ఈవిషయంపై కొందరు కార్మికులు సంబంధిత డీఈఈ, ఏఈఈల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో సొసైటీ చేస్తున్న మోసాలను ఫిర్యాదు రూపంలో తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సొసైటీకి భయపడిన కార్మికులు ఎవ్వరు కూడా ముం దుకు వచ్చి ఫిర్యాదు చేయడంలేదు.



కర్నూలు కార్పొరేషన్ కార్యాలయం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



కార్మికులు జీతాల్లో కొత విధిస్తున్న సొసైటీపై కార్మికులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అస్సలు ఎందుకు జీతాల్లో కొత విధిస్తున్నారో సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుంటున్నాం. కార్మికులకు అన్యాయం చేస్తే సహించం.

\- రవీంద్రబాబు, కార్పొరేషన్ కమిషనర్

జీడీపీ నుంచి పైపులైన్ ఏర్పాటు చేయాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మలకు టీడీపీ కార్యకర్తల విజ్ఞప్తి

కోడుమూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణ తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి కోడుమూరుకు పైపు లైన్ ఏర్పాటు చేయాలని టీడీపీ కార్యకర్తలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. పత్తికొండ పర్యటనను ముగిం చుకొని మంగళవారం కోడుమూరు మీదుగా కర్నూలుకు వెళ్తున్న మంత్రికి కోడుమూరులో కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత పార్టీపై ఉందని, జీడీపీ నుంచి కోడుమూరుకు పైపు లైను ఏర్పాటు చేసి పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి వెంట టీడీపీ సీని యర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఉన్నారు.

కరువును నివారించి జీవనోపాధి కల్పించండి

కర్నూలు అగ్రికల్చర్: జిల్లాలో కరువు పరిస్థితులను పరిశీలించి జీవనోపాధి కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి.. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కర్నూలు నగరంలోని స్టేట్ గెస్టు హౌస్‌లో మంత్రి నిమ్మల రామానాయుడును సీపీఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆర్డీఎస్ నుంచి కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి కోసం 4 టీఎంసీలను కేటాయించిందని, ఈ ప్రాజెక్టుకు వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయాలని వారు మంత్రి దృష్టికి తెచ్చారు.

మంత్రులను కలిసిన టీడీపీ కార్పొరేటర్లు

కర్నూలు న్యూసిటీ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను టీడీపీ కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని మౌర్య ఇన్‌లో కలిసి నగర అభివృద్ధికి నిధులు కేటాయించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కురువ పరమేష్, విజయకుమారి, ఎస్ఎల్‌వీ సుజాత, క్లైప పద్మలతారెడ్డి, జకియా అక్సారి, షేక్ నీలో ఫర్, విజయలక్ష్మి, అన్నెపోగు క్రాంతి కుమార్, అబ్దుల్ లతీఫ్, శివమ్మ పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న టీడీపీ కార్యకర్తలు

కె.నాగలాపురం చెరువును అభివృద్ధి చేస్తాం

గూడూరు: కె.నాగలాపురం చెరువును అన్ని విధాలా అభివృద్ధి చేసి ఇక్కడి రైతాంగానికి సాగు, ప్రజలకు తాగునీరు అందిస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం పత్తికొండ నుంచి కర్నూలు వెళ్తూ జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ అభ్యర్థన మేరకు మార్గ మధ్యలో కెనాగలాపురం చెరువును మంత్రి పరిశీలించారు. మంత్రికి మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్ చెరువు అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు జె.సురేష్, సర్పంచ్ జెనయోమి, రైతు సంఘం నాయకుడు గోపాల్ రెడ్డి ఉన్నారు.

రోగులకు త్వరగా చికిత్స అందించాలి

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): క్యాజువాల్టీకి వచ్చే రోగులకు త్వరగా చికిత్స అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ధన్వంతరీ హాలులో అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. రోగులకు సంబంధించిన ఈ హాస్పిటల్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలన్నారు. ఈనెల 19న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించడానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తు న్నారన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో కూడా ఆయన పర్యటిస్తారన్నారు. సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మిని స్ట్రేటర్స్ శివబాల, కిరణ్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దంత సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దంత సంరక్షణపై నిర్లక్ష్యం వహించొద్దని కోడుమూరు పీహెచ్‌సీ డెంటల్ సర్జన్ డాక్టర్ హడస అన్నారు. లద్దగిరి పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సందర్భంగా దంత సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ముందుగా వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆసుపత్రి ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శాంత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసయాదవ్ సూపర్‌వైజర్లు శారద, ఉమ పాల్గొన్నారు.

వైభవంగా అప్పాల రెడ్డి తాత రథోత్సవం

గూడూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు గ్రామంలో అప్పాల రెడ్డి తాత రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం గూడూరు మండలం గుడిపాడులో అప్పాల రెడ్డి తాత ఆలయంలో స్వామి వారికి పూజలు చేశారు. రథోత్సవాన్ని తిలకిం చేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ విత్తన దుకాణాల యజమానులను హెచ్చరించారు. మంగళవారం సి.బెళగల్‌లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

అక్రమాలపై విచారణ జరపాలి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో సెక్యూరిటీ ఏజెన్సీ అక్రమాలపై విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్ కాలపరిమితి ముగిసినప్పటికి కొత్త టెండర్ వేయకుండా పాత టెండర్‌నే కొనసాగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ఏజెన్సీని రద్దు చేసి నూతన టెండర్ వేయాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.4.20 లక్షల చెల్లిస్తున్నారని, సెక్యూరిటీలుగా దాదా పు 34 మందిని నియమించారని, అయితే ప్రస్తుతం 18 మంది మాత్రమే పని చేస్తున్నారని, కానీ 34 మంది వర్సిటీ నుంచి జీతాలు తీసుకుంటున్నార న్నారు. వర్సిటీ కో-కన్వీనరు మౌలాలి, రాజు, సాగర్ యాదవ్, అమర్, జోష్, కుమార్ రాజేష్, ఉమర్, గణేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

గ్యాస్ ధర తగ్గించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం పేరుతో లీటర్‌పై రెండు రూపాయలు పెంచడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా లో ఆయన మాట్లాడుతూ పెరిగిన ఎక్సైజ్ సుంకంతో ప్రజలపై భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టాక 15 సార్లు గ్యాస్ ధరలు పెంచిందని ఆరోపించారు. కార్యక్ర మంలో నాయకులు నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

● పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ పూలబజార్‌లో సీపీఎం పాతబస్తీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర నాయకురాలు జయమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ పేద ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి ఈ రోజు కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలకడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌దేశాయ్, చాంద్ బాషా పాల్గొన్నారు.



పూలబజార్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రేపటి నుంచి కోన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

సి.బెళగల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలములోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గురువారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈనెల 10న గరుడోత్సవం, 11న ప్రభోత్సవం, 12న రథోత్సవం 13న పారువేట, 14న వసంతోత్సవం, 15న బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



కోన వేంకటేశ్వరస్వామి

అంధకారంలో ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండు

● వెలగని విద్యుత్ దీపాలు ● ఇబ్బందుల్లో ప్రయాణికులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఉన్న ఆర్టీసీ బస్టాండు విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గత పది రోజులుగా కరెంటు లేకపోవడంతో చీకట్లో ప్రయాణికులు బస్టాండు లోపల కూర్చోలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆర్టీసీ బస్టాండులో చెత్తాచెదారం పేరుకుపోయిన పట్టించుకోవడం లేదు. ఓర్వకల్లు బస్టాండు నుంచి కర్నూలు, నంద్యాల, బనగానపల్లె, కోవేలకుంట్ల తదితర పట్టణాలకు ప్రయా ణికులు వెళ్తుంటారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రాత్రివేళల్లో లైట్లు వేసి బస్టాండు ప్రాంగణం అంతా శుభ్రంగా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఓర్వకల్లు ఆర్టీసీ బస్టాండు

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదా రంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకులం)లో ఈనెల 13వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించనున్న 'శ్రీమద్రామాయణ మహాయజ్ఞం' వివరాలు తెలియజేసే పోస్టర్‌ను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మంగళవారం సంకల్‌బాగ్‌లోని ఆయన స్వగృహంలో గోదాగోకులం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదాగోకులం ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమాలన్నీ భక్తులకు ఉపయుక్తంగా ఉంటు న్నాయని, ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, సభ్యులు పెరుమాళ్ల బాలసుధాకర్, చిత్రాల వీర య్య, కంభం కిష్టయ్య, గోవిందరాజులు, తల్ల సురేష్, వేముల జనార్దన్, నాగ సురేష్, ఇల్లూరు రామయ్య, మాకం శ్రీనివాస్, పెరుమాళ్ల సుబ్రహ్మణ్యం, భీమిశెట్టి ప్రకాశ్, వేముల రవిప్రకాశ్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో అన్నదాతలకే ప్రాధాన్యం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతు బజార్లలో అన్నదాతలకే ప్రాధాన్యం ఉండాలని, రైతుబజార్లను ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఆయన స్పందిస్తూ మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, సీఐ శేషయ్య, సీ.క్యాంపు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మలకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు కూరగాయలను గిట్టుబాటు ధర అందించేందుకు, ప్రజలకు తక్కువ ధరకే కూరగాయలు అందజేసేందుకు రైతుబజార్లను నిర్వహిస్తున్నదని అన్నారు. రైతుబజార్లలో రైతులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఆ తర్వాత పొదుపు లక్ష్మి మహిళలకు అవకాశం కల్పించాలని ఆదేశించారు.

ఏఐపీఈఈ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీగా ఈశ్వరయ్య

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐపీఈఈ)-పోస్టుమెన్ అండ్ ఎంటీఎస్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీగా ఈశ్వరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీకాళహస్తిలో జరిగిన ఏపీ సర్కిల్ రాష్ట్ర మహాసభల్లో అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న కర్నూలుకు చెందిన ఈశ్వ రయ్యను డిప్యూటీ సెక్రటరీగా రాష్ట్ర నాయకత్వం ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఈశ్వరయ్యకు పీ3 జిల్లా కార్యదర్శి గిరిబాబు, ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.మహ్మద్‌జాని, పీ4 జిల్లా కార్యదర్శి శమంతక రెడ్డి అభినందనలు తెలిపారు.

పురమిత్ర యాప్ సేవలు వినియోగించుకోండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్ సేవలను నగర ప్రజలు వినియోగించుకోవాలని అడిషనల్ కమిషన్ ఆర్‌జీవీ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల్లో పరికరాలు, రహదారుల మరమ్మతులపై ఈయాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆస్తి, కొళాయి, ట్రేడ్ లైసెన్సు రుసుంలు కూడా చెల్లించవచ్చన్నారు. పురమిత్ర యాప్‌ను ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా యాన్యువల్ కమాండేషన్ డే

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎ.క్యాంపు షైఫర్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం యాన్యువల్ కమాండేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ సతీష్, అకడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ హాజరై 2024-2025 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అంద జేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డైరెక్టర్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాసర్ల సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమడగుంట్లలో పరుగు పందెం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల గ్రామంలో శ్రీరామనవమి, సవారమ్మదేవి వేడుకల సందర్భంగా మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు పరుగు పోటీలు నిర్వహించారు. గ్రామం నుంచి చిల్లబండ స్టేజీ వరకు వెళ్లివచ్చే పరుగుపందెంలో గొల్ల నవీన్ మొదటి స్థానంలో నిలిచారు. అలాగే గొల్ల జయక్రిష్ణ, గొల్ల యల్లక్రిష్ణ తర్వాత విజేతలుగా నిలిచారు. విజేతలకు బోయ సుబ్బన్న జ్ఞాపకార్థం కుమారులు అమడగుంట్ల బ్రదర్స్ బహుమతులు అందజేశారు. టీడీపీ పార్లమెంటు ఉపా ధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు క్రిష్ణారెడ్డి, సుంకన్న, రాజు, మాదన్న, చెన్నారెడ్డి, భీమి రెడ్డి, శ్రీరాములు, నంద్యాల శ్రీను పాల్గొన్నారు.

నీటి తొట్ల నిర్మాణాన్ని పూర్తి చేయండి



నీటి తొట్టిని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నీటి తొట్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఓర్వకల్లులోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 16 నీటి తొట్లు మంజూరు చేశారన్నారు. వీటికి ఒక్కొక్కటికీ రూ.33వేలు ఉపాధి పథకం ద్వారా చెల్లిస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ మం డల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు.



హొళగుంద మండలం హెబ్బటం గ్రామంలోని సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ గట్టుకు ప్రమాదం పొంచి ఉంది. నిర్వహణ లేకపోవడంతో గట్టుకు పగుళ్లు ఏర్పడ్డాయి. హెబ్బటం, లింగంపల్లి , పెద్ద గోనేహాల్, ఎండీ హళ్లి, ఇంగళదాహాల్, బోల్లురు, సంతేకుడ్లూరు, యడవల్లి, పెద్ద హరివాణం, వందవాగాలి తదితర గ్రామాలకు ఇక్కడి నుంచే తాగునీరు అందుతోంది. అధికారులు మంచినీటి పథకాన్ని ఇలా వదిలేయడంపై గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - **హొళగుంద**



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కుట్టుమిషన్ల గోడౌన్ కాదు. వీటిని అంబేడ్కర్ భవన్‌లో నిల్వ ఉంచారు. ఇక్కడ సచివాలయం కొనసాగుతోంది. అయితే ఈ భవనంలో ఎంపీడీవో కార్యాలయ అధికారులు కుట్టుమిషన్లను నిల్వ ఉంచడంతో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సచివాలయానికి కేటాయించిన భవనంలో అధికారులు ఉపాధి కార్యాలయం ఏర్పాటు చేశారు. మరోవైపు అంబేడ్కర్ భవనాన్ని తమకు స్వాధీనం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు. - **ఆలూరు**

ఇసుకను తరలించాలంటే ఎమ్మెల్యేను కలవాల్సిందే..!

• సోషల్ మీడియాలో ఆడియో వైరల్

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇసుకను తరలించాలంటే ఎమ్మెల్యేను కలవాల్సిందేనని, అలా కాకుంటే ట్రాక్టర్‌ను వదిలి పెట్టమని ఎమ్మెల్యే పీఏ అని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సదరు వ్యక్తి కొంతకాలంగా ఎమ్మెల్యే పేరు చెప్పుకొని పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాయతీలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ ఎవరైనా లంచం అడిగితే చెంప చెళ్లుమనిపించమని చెప్పి రెండు రోజులు గడవక ముందే ఈ ఆడియో టేపులు రావడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కబేళాను పరిశీలించిన కమిషనర్

ఆదోని టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్న, పెద్ద కబేళాలను మున్సిపల్ కమిషనర్ కృష్ణ మంగళవారం పరిశీలించారు. ఆవరణలో పశువుల వ్యర్థాలను పడేయరాదని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఫ్లెక్సీలను చించిన వారిపై చర్యలు తీసుకోవాలి

• మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలం లింగంపల్లిలో అంబేడ్కర్ ఫ్లెక్సీను, జెండాను చించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. సీఐ రవిశంకర్ నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మల్లికార్జున, వెంకటరాముడు, మల్లి, భీమ, లింగప్ప, భరత్, కృష్ణ, వీరేష్, బసవరాజు, హనుమంతు, రమేష్, జయరాం, గిరప్ప, నరసింహులు, మారెన్న పాల్గొన్నారు.

గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు ఎందుకు తరలిస్తున్నారు?

• మండల సమావేశంలో సర్పంచుల ఆవేదన



డాక్టర్ ఆశాలతను ప్రశ్నిస్తున్న గోనబావి సర్పంచ్ అలీ

ఆదోని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు ఎందుకు తరలిస్తున్నారని గోనబావి సర్పంచ్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పెద్దతుంబళం వైద్యాధికారి ఆశాలత మాట్లాడుతుండగా గోనబావి సర్పంచ్ ఆశా వర్కర్లు గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళుతున్నా మీరే చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు కృష్ణాచారి మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకులు, చెరువులను ఎల్లెల్సీ నీటితో నింపామని తెలిపారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య ఈవోఆర్డీ జనార్దన్ ఉన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈవో రంగస్వామి

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎంఈవో రంగస్వామి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సవిత సూచించారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపిన ఐదు మంది విద్యార్థులకు రూ.వెయ్య, ప్రశంసాపత్రాలు అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ క్రీడలు కూడా ముఖ్యమని తెలిపారు.

టీబీ బాధితుల దత్తత

ఆదోని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన క్షయ బాధితులను పీహెచ్‌సీ సిబ్బంది దత్తత తీసుకున్నారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి సమక్షంలో ఆరు నెలలకు సరిపడే కిట్లను అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్షయను నిర్మూలించవచ్చని, ప్రభుత్వం ఇస్తున్న మందులను తప్పక వాడాలన్నారు. వైద్యులు ఇమ్రాన్, షేకన్‌బాను, ఎంపీహెచ్‌ఈఓ లక్ష్మీ నారా యణ, ఏఎన్ఎం లక్ష్మి, సెక్రటరీ చంద్రశేఖర్, బాబురావు, పాల్గొన్నారు.

లోకాయుక్త పిటీషన్లపై డీఎల్పీవో విచారణ



అధికారులను విచారిస్తున్న డీఎల్పీవో లక్ష్మి

వెల్దుర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలోని లోకాయుక్త పిటిషన్లపై డీఎల్పీవో లక్ష్మి విచారణ నిర్వహించారు. మంగళవారం వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో షాపుల ట్రేడ్ లైసెన్స్, 15 గ్రామాల జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన లోకాయుక్త పిటిషన్లను విచారణ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రవికిశోర్, అప్పటి పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీమను సస్యశ్యామలం చేస్తున్న సీఎం

• మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, • హంద్రీ నీవా కాలువ పనుల పరిశీలన



కాలువ విస్తరణ పనులు పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి

పత్తికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరువు సీమను సీఎం చంద్రబాబు సస్యశ్యామలంగా చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. మంగళవారం హంద్రీ నీవా విస్తరణ పనులను పరిశీలించారు.

పత్తికొండ టౌన్: పందికోన, క్రిష్ణగిరి రిజర్వాయర్ల కింద ఉన్న పంట కాలువలను పూర్తి చేయాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు రాజాసాహెబ్, నబీ రసూల్ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. గురుదాస్, తిమ్మయ్య, కారన్న, కారుమంచి, వీరన్న, వెంకటేశ్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• పందికొన రిజర్వాయర్ ఆయకట్టు 61వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఆయకట్టు సాధన సమితి నాయకులు శేషాద్రి రెడ్డి, కల్లూరు శేఖర్ రెడ్డి మంత్రిని కోరారు. అలాగే కాలువకు తూములు, పిల్లకాలువలను ఏర్పాటు చేయాలని బీజేపీ కళాకారుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ మంత్రి నిమ్మలను వినతి పత్రం అందజేశారు.

మండల సమస్యలపై మంత్రికి వినతి

దేవనకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పనులు పూర్తి చేసి, పంటపొలాలకు సాగునీరు అందించాలని వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, డీవీఎంసీ సభ్యులు శాంతికుమార్, మల్లేపలి రంగడు వితిపత్రం ఇచ్చారు.

చెరువులను నింపాలి

తుగ్గలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలని సీపీఐ నాయకులు నబీ రసూల్, సుల్తాన్, రోళ్లపాడు వెంకటేశ్వర్లు కోరారు. మంగళ వారం మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం సమర్పించారు.

చెరువులను నింపి దాహార్తి తీర్చండి

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలోని రెండు చెరువులను హంద్రీ నీవా నీటితో నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి కోరారు. మంగళవారం మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇచ్చారు.

మంత్రితో కలిసి ఎమ్మెల్యేలు శ్యాంబాబు, గుమ్మనూరు జయరాం మండలంలోని పెరవలి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ రాజన్న యాదవ్ ఉన్నారు.

సాగునీరు అందించాలి

చిప్పగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీ తూము ఏర్పాటు చేసి ఆలూరు ఉపకాల్వకు సాగునీరు అందించాలని జల వనరుల శాఖ నిమ్మల రామానాయుడును గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి నాయడు కోరారు. మడలం వద్ద ం లాశయం, చిప్పగిరి నుంచి దౌల్తాపురం మీదుగా రోడ్డు పనులు ఆగిపోయానని వివరించారు.

కార్యకర్తలను కాపాడాలని వినతి

• పరిష్కరిస్తానని మంత్రి హామీ



ఇన్‌చార్జి మంత్రిని వేడుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తమను కాపాడాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆదోని టీడీపీ కార్యకర్తలు విన్నవించారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని కలిశారు. ప్రజలకు పరిచయం లేని వ్యక్తిని కేవలంలో 23 రోజుల్లోనే ఎమ్మెల్యేగా గెలిపించుకున్నామని. అయితే ఎమ్మెల్యే వైసీపీ నాయకులను బీజేపీలోకి చేర్చుకుని వారిచే హవా నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



టీడీపీ శ్రేణులతో మీనాక్షినాయుడు

ఎమ్మెల్యే పార్థసారథి తమను పట్టించుకోవడం లేదని అన్నారు. ఇన్‌చా ర్జి మంత్రి స్పం దిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే సమస్యను పరిష్కరిం చేందుకు వచ్చానన్నారు. ప్రయత్నించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆయన తమ్ముడు ఉమాపతి నాయుడు, ఇతర నాయకులతో మాట్లాడారు.

సూపర్ సిక్స్‌ను అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పంటల దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. కౌలు రైతులకు సమగ్ర కౌలు చట్టాన్ని అమలు చేయాలన్నారు. హంద్రీ-నీవా లైనింగ్‌కు విడుదల చేసిన జీవో 404,405 రద్దు చేసి పనులు ఆపాలన్నారు. నిరుపేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు భూమి ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరారు. రాజు, హనుమంతు, మధిరే నాగరాజు, సౌరప్ప, నారాయణ, పీవో డబ్ల్యు మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మణిమ్మ పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ఆలూరు సమస్యలు





బొకే ఇస్తున్న వీరభద్ర గౌడ్.. వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆలూరు సమస్యలను విన్నవించినట్లు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి తెలిపారు. మంత్రిని పత్తికొండలో కలిశామన్నారు. వేదవతి, నగరడోణ ప్రాజెక్టులను పూర్తిచేయాలని కోరిటనట్లు వారు తెలిపారు.

పౌష్టికాహార పక్షోత్సవం



సీమంతం చేస్తున్న సీడీపీవో లూక్

వెల్దుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలోని రామళ్లకోట గ్రామ సచివాలయంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవం సీడీపీవో లూక్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలి తెలియజేశారు. పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే బాలమృతంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పోరాడదాం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు కలిసికట్టుగా పోరాడుదామని సీపీఐ కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ మోదీ పాలన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉందన్నారు. రాజు, విజయ్ కుమార్, భీమేష్ పాల్గొన్నారు.

పరిహారం మంజూరు

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శనగ, జొన్న పంటలకు ప్రభుత్వం పంట నష్టం పరిహారం మంజూరు చేసిందని ఏవో రవి తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ 2024-25 రబీలో సాగు చేసిన 7,500 మంజూరు చేసిందన్నారు.

బండలాగుడు పోటీలు

తుగ్గలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తుగ్గలిలో నిర్వహించిన రాతిదూలం పోటీలను తుగ్గలి నాగేంద్ర కుమారుడు వంశీ ప్రారంభించారు. సర్పంచ్ రవి, గ్రామస్థులు సర్వేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పత్తికొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామానికి చెందిన కోయిలకొండ రాముడు (55) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. వివరాల మేరకు.. ఇంటివద్ద రేకుల షెడ్డు ఏర్పాటుచేస్తున్న సమయంలో రేకులకు విద్యుత్ ప్రవహించి రాముడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పత్తికొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు

ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకుంటుంది

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పరికరాలు ఇచ్చి ఆదుకుంటుందని జిల్లా ఫిజియోథెరపిస్టు గంగాభవాని, సాయి పూజిత అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో లోపాలున్న వారికి పరికరాలు ఇచ్చేందుకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మండలంలోని దివ్యాంగుల వివరాలను పరిశీలించి ఆరు నెలల్లోపు వారికి పరికరాలు ఇస్తామన్నారు. దావీదు, మహేంద్ర, ఎంపీడీ వో కొండయ్య తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ కష్టాలు



మున్సిపల్ మెయిన్ రోడ్డులో ఇలా..

ఆదోని టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రధాన రహదారులు మున్సిపల్ మెయిన్ రోడ్డు, పండిట్ నెహ్రూ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చలానాలను రాసేందుకే పరిమితమవుతున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రహదారులను విస్తరించి, ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

నాణ్యత పాటించకుంటే చర్యలు



కొలతలు వేస్తున్న అధికారులు

దేవనకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మానంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని క్వాలిటి కంట్రోల్ ఏఈ మాధవప్రసాద్ ఇన్‌చార్జి పీఆర్ ఏఈ ఉదయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పోట్లపాడు గ్రామంలో రెండు, దేవనకొండలో ఐదు, నేలతల మర్రిలో రెండు సీసీ రోడ్ల కొలతలు, నాణ్యతను పరీక్షించారు. కోర్‌కట్టింగ్ చేసి నాణ్యత ప్రమాణాల కోసం క్వాలిటీ టెస్టింగ్ సెంటర్‌కు తరలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు వెంకటప్పనాయుడు, మురళి, రేణుక, నాగేంద్ర, కాంట్రాక్టర్లు ఉన్నారు.

కంపచెట్ల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో పనులు

చిప్పగిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంటనహాల్ నుంచి గుంతకల్ హంద్రీనీవా కాలువ దారికి అడ్డంగా ఉన్న ముళ్లకంపను యువత తొలగించారు. సోమవారం గ్రామస్థుల సహకారంతో ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసుకుని పనిచేశారు. దశాబ్దాల నుంచి విన్న విస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని, తామే పనిచేసినట్లు తెలిపారు. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మించాలని భాస్కర్ మల్లికార్జున సురేష్ రాజే ష్ ఈశ్వరయ్య ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి ప్రతిపాదన పంపించాలని కోరారు. కంప అడ్డుగా ఉండటంతో తొలగిస్తున్నారు.

వసతి గృహాలకు సన్నబియ్యం



దేవనకొండలో ఆహారాన్ని రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

• అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు
• ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జూన్ నుంచి ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ సెంటర్లకు, సన్నబియ్యం ఇస్తున్నట్లు ఫుడ్ కమిషన్ చైర్మన్ వియప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం పట్టణంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. కర్నూలు రోడ్డులో బుడగజంగాల కాలనీలోని అంగన్‌వాడీ సెంటరులో, బాలుర ఉన్నత పాఠశాలను, కస్తూర్బా, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలల్లో భోజనాన్ని పరిశీలించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు ఇచ్చిందని వాటిని ఉపయోగించుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఆర్డీవో భరత్ నాయక్, తహసీల్దార్ రమేష్ సీడీపీవో లలిత, ఎంఈవో రమేష్ బాబు, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ జిట్టా విజయప్రతాప్ రెడ్డి హాస్టల్ విద్యార్థు లకు సూచించారు. మంగళ వారం బీసీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. సరుకులను తనిఖీ చేసి స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. జిల్లా అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి రాజు కుల్లాయప్ప, తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, వార్డెన్ రాజశేఖర్ రెడ్డి, ఎంఈవో రంస్వామి, పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

దేవనకొండ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఫుడ్ కమి షన్ చైర్మన్ సూచించారు. మంగళ వారం దేవనకొం డలోని 1, 6 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిం చారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారాన్ని రుచిచూశారు. గుడ్డు 450 గ్రాములు ఉండాల్సి ఉండగా, 350 గ్రాములే ఉండటంతో నిర్వా వాకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్య లేకున్నా, తూకాల్లో తేడాలున్నా 9490551117 నంబర్‌కు వీడియో రూపంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో రఘురామిరెడ్డి, అడిషనల్ డీఈఎంహెచ్‌వో భాస్కర్, తహసీల్దార్ ప్రసా దురాజు, ఎంఈవోలు తిమ్మారెడ్డి, నిర్మలాదేవి, వైద్యాధికారి కళ్యాణ్ ఉన్నారు.

చిరుధాన్యాలను సాగు చేసుకోవాలి

ఏరువాక ప్రధాన కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ



మాట్లాడుతున్న సుజాతమ్మ

గోనెగండ్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని ఏరువాక ప్రధాన కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రిసెర్చ్ వారి సహకారంతో ఏరువాక కేంద్రం కర్నూలు శాఖ వారి ఆధ్వర్యంలో కులుమాల గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన, రైతు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ జొన్న, సజ్జ, రాగులు, సామ, ఊద, అరికలు, వరిగసాగు, మెలకువలు, వివరించారు. మేలురకపు కలుపు యాజమాన్యం, మార్కెటింగ్ పద్ధతులను తెలియజేశారు. సమావేశంలో శాస్త్రవేత్తలు రవికి శోర్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, గ్రామ ఉద్యన సహాయ కులు రహీమ్, ఎఫ్‌పీవో సభ్యులు వెంకటేశ్వర్లు, రామాంజినేయులు, రైతులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లు ఇంటింటి సర్వే సమయంలో సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘవ్యాధులపై దృష్టి సారించాలని నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తల మాసాంతపు సమీక్షా సమావేశం డాక్టర్ సాయి జాహ్నవి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ప్రధానంగా ఇంటింటికి సర్వే సమయంలో క్యాన్సర్, గుండె, మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిపై దృష్టి పెట్టాలన్నారు. శిశువులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నిస్సి గ్రేస్, వీణ, శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి నిజ బృందావన దర్శనం

మంత్రాలయం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి సందర్భంగా రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని మంగళవారం భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి, మహా మంగళహారతులు ఇచ్చారు.

శ్రీమఠానికి విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి వివిధ ఏజెన్సీలు నిత్యావసర సరుకులు విరాళంగా ఇచ్చారని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు శ్రీపతాచార్, వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్ తెలిపారు. మంగళవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు సంబంధించిన వ్యాపారులతో శ్రీమఠానికి అవసరమైన నిత్యావసర సరుకులు వేలం నిర్వహించారు. ఇందులో వేలం దక్కించుకున్న కొంతమంది వివిధ రకాల వస్తువులను విరాళంగా ఇచ్చారు. వేలాల్లో పాల్గొన్న వ్యాపారులతో పాటు విరాళం ఇచ్చిన వ్యాపారులను పీఠాధిపతి అభినందించారు.

రేపు కంటి వైద్య శిబిరం

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని కలుగొట్ల రోడ్డు జీసెస్ టెంపుల్ మినిస్ట్రీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 10న గురువారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ సోలోమోను తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి వైద్య శిబిరం ఆర్కెకంటి వైద్యశాల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఆపరేషన్లు చేయటంతో పాటు చుక్కల మందులు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులదే బాధ్యత: ఎంఈవో



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో రాఘన్న

మంత్రాలయం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, మెనూ చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయుల దేనని ఎంఈవో రాఘన్న అన్నారు. మంగళవారం మండలంలోని మాలపల్లి, రచ్చమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్య బోధన, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పరీక్షల నిర్వహణ ఆయా పనితీరును పరిశీలించారు. ఆయన వెంట వెంకటస్వామి, సత్యనారాయణ, అనురాధ, హనుమంతు, ఈరన్న, రాంప్రసాదు, శ్రీనివాసులు, ఇబ్రహీం, శ్రీదేవి, శ్యామలత పాల్గొన్నారు.

సేవా దృక్పథం పెంచుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం పెంచుకోవాలని అల్లుఅర్జున్ సేవా సమితి పట్టణ అధ్యక్షుడు లక్ష్మన్న, వైస్ ప్రెసిడెంట్ తమ్మినేని వీరేష్ అన్నారు. మంగళవారం అల్లుఅర్జున్ జన్మదినాన్ని ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, ఫూలే బాల, బాలికల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అల్లు అర్జున్ అసోసియేషన్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

12 మందితో ప్రతిపాదనలు

మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం వాయిదా

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటుకు 12మందితో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి కురువ మలయ్యను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రతిపాదించారు. దీంతో ఇటీవల విడుదలైన మార్కెట్ కమిటీ చైర్మన్ల జాబితాలో ఎమ్మిగనూరు నుంచి చైర్మన్‌గా కురువ మల్లయ్య పేరు వచ్చింది. అలాగే డైరెక్టర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపేందుకు ఎమ్మెల్యే ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణం, బీజేపీ, జనసేన నుంచి డైరెక్టర్లను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. ప్రభుత్వం పరిశీలించి పాలకవర్గం ఏర్పాటుకు జీవో జారీ చేసిన వెంటనే ప్రమాణస్వీకారం జరిగే అవకాశం ఉంది. కాగా ఈనెల 9న జరగాల్సిన మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సమావేశం వాయిదా పడినట్లు సమాచారం. ఈనెల 16న గాని, అటు తరువాత కాని ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉండే అవకాశం ఉంది.



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని భక్తులు స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విష్ణువర్ధన్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, విజ్జమ్మ, ఆలయ పూజారులు సత్యనారాయణ, శేఖర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవానికి హాజరైన భక్తులు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ది ఎమ్మిగనూరు కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కి సంబంధించిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మంగళవారం కో ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, కొండలయ్య సొసైటీ సీఈవో ఆధ్వర్యంలో నామినేషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, నాలుగు డైరెక్టర్ల కోసం విఠల్‌రావు, షెక్షా సాహెబ్, అక్కిమి వెంకటరెడ్డి, రామన్న, చిన్న బుడ్డప్ప, రఘునాథ్ నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. సొసైటీలో 1143 మంది సభ్యులు ఉండగా, సభ్యులు అందరూ ఆమోదం తెలిపినట్లు సమాచారం. కొసమెరుపు ఏమిటంటే సొసైటీ సంవత్సరం ఆదాయం దాదాపు రూ. 10 కోట్ల ఉండగా, ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా ప్రజలకు తెలియకుండా, పత్రికలకు సమాచారం ఇవ్వకుండా ఎన్నికలు జరపడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు మండిపడ్డారు.



నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలపై వాగ్వాదం

సోషల్ మీడియాలో ఆడియో వైరల్

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై అధికార పార్టీకి చెందిన ఇరువురు నాయకుల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం సోషల్ మీడియాలో కలకలం రేపింది. నందవరం మండలంలోని రాయచోటి, గురుజాల గ్రామాలకు చెందిన ఇరువురు అధికారపార్టీ నాయకులు ఇసుక అక్రమ తవ్వాకాలు, వ్యాపారం చేసుకునే విషయంలో పరస్పరం వాగ్వాదం చేసుకున్నారు. మా గ్రామం దగ్గర ఉన్న నదిలో మేమే తవ్వుకోవాలని మీరేవరు తవ్వటానికి అంటూ ఒకరిపై ఒకరు తీవ్రంగా వాగ్వాదం చేసుకున్నారు. మీకు చేతనైతే ఆపుకోవాలని చాలెంజ్ చేశారు. అంతేగా ఓ నాయకుడు ఏకంగా తమ ఇసుక వాహనం పట్టుకుంటే ఓ పోలీసు అధికారికి రూ.50వేలు ఇచ్చినట్లు చెప్పటం ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ ఆడియో కాస్త రెండు మూడు రోజులనుంచి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో అధికార పార్టీ నాయకులు విస్మయానికి గురువుతున్నారు.

ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలి



వైద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఆశా వర్కర్లు

గోనెగండ్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను రెగ్యులర్ చేసి, రూ.26వేల జీతం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించే కార్యక్రమంలో ఆశా వర్కర్లు మందుంటారని తెలిపారు. వారి సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేబర్ యాక్ట్ ప్రకారం ఆశావర్కర్లకు ఇవ్వాల్సిన సౌకర్యలు కల్పించాలన్నారు. అనంతరం వైద్యురాలు రవళికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నబిరసూల్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మంగళవారం దొడ్డిమేకల గ్రామంలోని పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల రక్తహీనతను నియంత్రించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రామేశ్వరి, అరుణ , గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో తప్పు చేస్తే ఉపేక్షించం



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

నందవరం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో తప్పు చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని ఎంపీడీవో పుల్లయ్య హెచ్చరించారు. మంగళవారం మాచాపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఎంతమంది కూలీలు వచ్చారని మస్టర్లను పరిశీలించారు. ఉపాధి పనుల్లో ఎవరైనా తప్పు చేస్తే ఎవరిని వదలనన్నారు. కూలీలు వలసలు వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాపవులు. మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి అభినందనలు



గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రశంసాపత్రాలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్, మెప్మా సిబ్బంది

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో మెప్మాకు చోటు దక్కడంపై ఎమ్మిగనూరు మెప్మా పీవో జయవర్ధన్, సిబ్బందిని మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అభినందించారు. మహిళాదినోత్సవం సందర్భంగా మెప్మా వావ్ జెని యాప్ ద్వారా పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను అధికసంఖ్యలో కొనుగోలు చేసిన మెప్మాకు రాష్ట్రస్థాయిలో గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న మెప్మా సిబ్బంది సైతం మహిళా దినోత్సవం రోజున రూ. 1.35లక్షల ఉత్పత్తులు కొనుగోలు చేయించారు.

జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈ నెల 11న బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న బీసీ సమరభేరిని జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయరాజు కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎర్రన్న, నాగేష్, దేవదానం పాల్గొన్నారు.

పెంచిన ధరలను తగ్గించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సోమప్ప సర్కిల్‌లో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీఐ అధ్యక్షుడు హుసేన్‌బాషా మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 పెంచి ప్రజలపై భారాన్ని మోపడం సరికాదన్నారు. దీని ద్వారా ట్రాన్స్‌పోర్టులపై భారం పడి నిత్య అవసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం వలన మధ్య తరగతి కుటుంబాల నడ్డి విరిస్తున్నారని అన్నారు. ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రహిమాన్, బాషా, నూరుల్లా పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజినేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దకడబూరులోని బస్టాండ్ ఆవరణలో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, రామాంజినేయులు, గూడు ఖాజా, నాగన్న, మూకన్న, శీను, ఎర్రన్న పాల్గొన్నారు.



పెద్దకడబూరులో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు



మాట్లాడుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపిందన్నారు. గ్యాస్ ధర రూ.858కు చేరడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే 14.2 కి.లోల గ్యాస్ ధర రూ.908కి చేరిందన్నారు. ఒకేసారి రూ.50 పెంచితే సామాన్యులు గ్యాస్‌ను ఎలా వినియోగించాలని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించకపోతే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మహిళా సమాఖ్య కార్యకర్తలు వాణి, నాగవేణమ్మ, ఉరుకుందమ్మ, శాంతి, వెంకటలక్ష్మి, వీరమ్మ, చాముండి పాల్గొన్నారు.

మంత్రాలయంలో ఫుడ్ కమిషన్ చైర్మన్



ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అధికారులు

మంత్రాలయం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి మంగళవారం సాయంత్రం మంత్రాలయం వచ్చారు. వీవీపీ సుజీంద్ర ఏసీ గెస్టు హౌస్ వద్ద మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు మహేష్, వలి బాషా, ఎంఈవో రాగన్న, వీఆర్వో భీమన్నగౌడు, సర్వేయర్ హరి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన మంత్రాలయంలోనే బస చేసి బుధవారం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల్లో పర్యటించనున్నారు. ఆయన రాకతో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, రేషన్‌షాపు డీలర్లు అప్రమత్తమయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రాలయం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంఈవో రాగన్న అన్నారు. మంగళవారం రాత్రి బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, భోజన హాల్, నిద్రించే గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. తాగు నీరు, మరుగుదొడ్ల వంటి సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు.

వాలీబాల్ పోటీల విజేత కాత్రికి జట్టు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు

కౌతాళం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బదినేహల్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతగా కాత్రికి జట్టు నిలిచింది. వాలీబాల్ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో మండలంలోని కాత్రికి గ్రామ జట్టు, స్థానిక బదినేహల్ జట్లు పోటీ పడగా ఫైనల్‌లో కాత్రికి జట్టు విజేతగా నిలిచింది. టీడీపీ నాయకుడు నరసింహులు రూ.15వేల నగదును, రన్నరప్ జట్టుకు జనసేనా నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మన్న రూ.10వేల నగదును మంగళవారం క్రీడకారులకు అందజేశారు. అనంతరం వారిని క్రీడా నిర్వాహకులు సన్మానించారు. నాయకులు చిన్న, రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ మూడుసెంట్ల స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ. 5లక్షలు నగదు ప్రభుత్వ ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం గోనెగండ్లలో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కుమారస్వామికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, కరుణాకర్, నబిరసూల్, నాయకులు రాజు, బజారి, హనుమంతు పాల్గొన్నారు.

రీసర్వేలో రైతులకు న్యాయం

మంత్రాలయం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): భూములున్న ప్రతి రైతుకు రీసర్వేలో న్యాయం జరుగుతుందని తహసీల్దార్ ఎస్.రవి, డీఐవోఎస్ శ్రీనివాసరాజులు అన్నారు. మంగళవారం గ్రామ సర్పంచ్ ముకురన్న ఆధ్వర్యంలో సుంకేశ్వరి గ్రామంలో రైతులకు రీసర్వేపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల భూముల సరిహద్దులు, కొలతల్లో తేడాలు, పేర్లు, ప్రభుత్వ భూములు, రైతుల ఎదుటనే సాగు చేస్తున్న విధానాన్ని సర్వే చేస్తారన్నారు. గ్రామంలో నాలుగు సర్వే టీములను ఏర్పాటు చేసి రోజుకు ఒక్కోటీముకు 20 ఎకరాల ప్రకారం కొలుస్తారని అన్నారు. రైతుల వద్ద భూసంబంధమైన పత్రాలు, పాస్‌బుక్‌లు, ఆన్‌లైన్ అడంగల్, ఈసీలు ఉండాలన్నారు. సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవా లన్నారు. సమావేశంలో మండల సర్వేయర్ అశోక్, రీసర్వే డిటీ సరస్వతి, వీఆర్వోలు ఆనంద్, గ్రామ సర్వేయర్ తిమ్మేష్, సర్వేయర్లు బీరప్ప శేఖర్‌నాయక్, ఉరుకుందాచారి, భవిత, శోభ, హేమచంద్ర, ధరణి, నాగమణి, హరిత, అనూష పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

పెద్దకడుబూరు: రీ సర్వే గ్రామ సభలోని భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు గీత ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న తుంబళం గ్రామంలోని రీ సర్వే గ్రామ సభ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ సర్వేయర్ శ్రీనివాస్ రాజు, రీ సర్వే డీటీ లలిత కుమారి, ఆర్ఐ జర్మియా, సర్వేయర్ అల్లప్ప, నాయకులు వీరేష్ గౌడ్, యల్లప్ప, రైతులు పాల్గొన్నారు.



సుంకేశ్వరిలో రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



చిన్న తుంబళం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్